క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

అల్లవరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అల్లవరం తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు పర్యవేక్షణలో గోడిలంక సచివాలయం వద్ద గురువారం సివిల్ రైట్స్ ఆఫ్ ప్రొటెక్షన్ యాక్టు, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రత్నం మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు ప్రోత్సహించకూడదన్నారు. వెనకబడిన వర్గాల్లో కులపరమైన సమస్యలు తలెత్తినప్పుడు చట్టాలను సక్రమంగా ఉపయోగించుకొని సమస్యలను అధిగమించాలన్నారు. కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, శెట్టిబత్తుల తులసీరావు, వీఆర్‌ఓ చంద్రరావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం


నూతన అధ్యక్షుడు అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: బార్ అసోసియేషన్‌కు ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. ప్రమాణ స్వీకారోత్సవ సభకు రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ ప్రతినిధి ముప్పాళ్ల సుబ్బారావు, కాకినాడ బార్ అసోసియేషన్ ప్రతినిధి నరహరిశెట్టి రవి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గంతో ముప్పాళ్ల సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చింతపల్లి అజయ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షుడిగా యాలంగి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దొమ్మేటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పి.వీరభద్రరావు, కోశాధికారిగా నందెపు చిన్న వెంకటేశ్వరరావు ప్రమాణం చేశారు. నూతన అధ్యక్షుడు అజయ్‌కుమార్‌ను సత్కరించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వీరన సాయి, సీనియర్ న్యాయవాదులు ఎండీ ఆజామ్, నల్లా ప్రభాకర్, డీటీ లోక్, ఏవీఎస్ ప్రసాద్, కళా వెంకట్రావు, నడింపల్లి సీతారామరాజు, కొమ్ముల నానాజీ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారి పడి జట్టు కార్మికుడి మృతి

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధి నక్కావారిపేట వద్ద ఒక వ్యక్తి ట్రాక్టర్‌పై నుంచి జారి పడి మృతి చెందాడు. చింతల మెరకకు చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావు(49) జట్టు కార్మికుడిగా పనిచేస్తుంటాడు. గురువారం పదోమైలు రాయి సెంటర్ నుంచి ట్రాక్టర్‌పై నక్కావారిపేటకు గ్రావెల్ తరలిస్తుండగా ట్రాక్టర్‌పై ఉన్న శ్రీనివాసరావు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందాడు. అతనికి భార్య ఈశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడకు ఇంద్ర ఏసీ సర్వీసు ప్రారంభం

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి విజయవాడ –3 స్టాప్ బైపాస్ నూతన ఇంద్ర ఏసీ సర్వీసును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం ప్రారంభించారు. జిల్లా ప్రజారవాణాధికారి రాఘవకుమార్ మాట్లాడుతూ ఈ సర్వీసు అమలాపురంలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి ఉదయం 9.30 గంటలకు నాలుగు గంటల్లో విజయవాడ చేరుతుందన్నారు. తిరిగి విజయవాడలో సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి రాత్రి 9.15 అమలాపురం చేరుతుందన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం


అమలాపురంలో ప్రారంభమైన వేసవి ఉచిత వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ శిబిరం

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో జిల్లా స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత వేసవి వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. శిబిరాన్ని మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు ప్రారంభించారు. ఈనెల 31 వరకూ శిక్షణ శిబిరం కొనసాగుతుందని జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. జిమ్ ప్రతినిధి గారపాటి చంద్రశేఖర్ అంతర్జాతీయ, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. కోచ్ ఎంవీ సముద్రం, అంతర్జాతీయ, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు పి.వందన,ఎం.వీరేంద్ర, బి.అప్పన్న, కె.మణిదీప్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

యానాం: పట్టణ పరిధిలో శ్రీలక్ష్మీజ్యూయలర్స్ అధినేత అద్దేపల్లి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం చిన్నాసెంటర్‌లో చలివేంద్రం ను యర్రా సుబ్బారాయుడు ప్రారంభించారు. వర్తకసంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, సెక్రటరీ కాపగంటి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో విడిది


కోరంగిలో సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన పర్యాటక హట్‌లు


కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్ హట్‌లలో ఏసీ, టీవీ తదితర సౌకర్యాలు

- పర్యాటకులు సేద తీరేందుకు ప్రత్యేక హట్‌లు
- ఆధునిక హంగులు, సౌకర్యాలతో నిర్మాణం
- సర్వాంగ సుందరంగా వసతి గృహాలు

తాళ్లరేవు: తూర్పున ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకున్న కోరంగి అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీ శాఖ ప్రత్యేక హట్‌ల(వసతి గృహాల)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశంలోనే రెండవ అతిపెద్ద మడ అటవీ ప్రాంతమైన కోరంగి అభయారణ్యాన్ని వేలాది మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు విడిది చేసేందుకు అటు కాకినాడ కాని ఇటు యానాం, అమలాపురం కాని వెళ్లవలసి వచ్చేది. అయితే కోరంగిలోనే పర్యాటకులు సేదతీరడంతో పాటు అక్కడ బస చేసేవిధంగా అత్యాధునిక సౌకర్యాలతో అటవీశాఖ వసతి గృహాలను ప్రారంభించింది. కోరంగి పంచాయతీలోని ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న మూడు హట్‌లతోపాటు మరొక ఫారెస్ట్ భవనాన్ని సైతం పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రతి రూములోనూ డబుల్ కాట్ బెడ్, ఏసీ, టీవీ, ఇన్వర్టర్ సౌకర్యాలను కల్పించారు. పర్యాటకులకు పూర్తిస్థాయిలో రక్షణ ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. ప్రాంగణంలో ఉన్న బయోడైవర్సిటీ భవనాన్ని సందర్శిస్తే కోరంగి మడ అభయారణ్యం విశేషాలను తెలుసుకోవచ్చు. ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకునే వారికి ఈ హట్‌లు ఒక వరంగా చెప్పవచ్చు.


కోరంగిలోని బయోడైవర్సిటీ భవనం

అందుబాటు ధరల్లోనే అద్దెలు

అటవీశాఖ ఏర్పాటు చేసిన ఈ హట్‌లలో ఒకరోజు బస చేసేందుకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ఉన్న అటవీ శాఖ అధికారులను సంప్రదిస్తే ఈ రూములను కేటాయిస్తారు. కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఒకప్పటి ఫారెస్ట్ బంగ్లాను వీఐపీ రూముగా సాధారణ పర్యాటకులకు సైతం అద్దెకు ఇవ్వనున్నారు. ఈ బంగ్లాకు ఒకరోజుకు రూ.3,000 చార్జి చేస్తారు. కోరంగి మడ అటవీ ప్రాంతాన్ని సందర్శించి ఒకరోజు ప్రకృతి ఒడిలో సేద తీరడం మరపురాని అనుభూతినిస్తుందని చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్



కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హట్‌లను సిబ్బంది ద్వారా కేటాయిస్తున్నాం. ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్ చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను సందర్శించి ఇక్కడ బస చేయాలనుకునే వారికి ఇదొక చక్కటి అవకాశం. ఇతర వివరాల కోసం 89859 52875 నంబరులో సంప్రదించవచ్చు.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కోరంగి అభయారణ్యం

8 నుంచి సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాలు


కొత్తలంక అనంతలక్ష్మి, పద్మావతీ సమేత వివేక సత్యనారాయణస్వామి

ముమ్మిడివరం: మండలంలో కొత్తలంక శ్రీ అనంతలక్ష్మి,పద్మావతి సమేత వివేక సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 8 నుంచి 12 వరకు జరిగే కల్యాణ మహోత్సవాలలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, సాముహిక కుంకుమార్చన, చక్రస్నానం, అన్న సమారాధనలు, గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల8న ఉదయం 7గంటలకు స్వామి వారి వ్రతాలు, రాత్రి 7గంటలకు కల్యాణం ఉంటుందన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ర్యాలీ

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు నాలుగోరోజు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి నల్లవంతెన వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. జిల్లాలో పలు మండలాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఈ ర్యాలీకి తరలివచ్చారు. జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి, వర్కింగ్ అధ్యక్షుడు ఏ.సాయి శంకర్, జిల్లా కార్యదర్శి,కె. సాయి తేజ పాల్గొన్నారు.


అమలాపురంలో ర్యాలీ చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

పింఛన్ల పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక 12వ వార్డు గాంధీబజార్‌లో పలువురి వృద్ధులకు కలెక్టర్ రావిలాల మహేష్‌కుమార్ సామాజిక పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ 12వ వార్డులో జరుగుతున్న సామాజిక పింఛన్ల పంపిణీని ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పింఛన్ల పంపిణీ సకాలంలో, సజావుగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.


వృద్ధురాలికి సామాజిక పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కార్మిక దినోత్సవం రోజున శ్రమ దోపిడీ

ఉపాధి శ్రామికులతో పనులు

ఉప్పలగుప్తం: కార్మికులకు స్వేచ్ఛ కల్పించే ఒకే ఒక్కరోజు ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున కూడా పెత్తందారీ వ్యవస్థ కొనసాగిస్తూ ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకుంటోందని అమలాపురం నియోజకవర్గం బీఎస్పీ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు వ్యాఖ్యానించారు. మండలంలోని చల్లపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించి గ్రామీణ వికాస శ్రామికులతో ముచ్చటించి మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కార్మిక దినోత్సవం రోజున ప్రతీ కార్మికునికి పూర్తి సెలవు దినం ప్రకటించి, ఆరోజు సెలవుతో కూడిన వేతనాన్ని చెల్లించాల్సి ఉందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు కార్మికుల స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. మాజీ వైస్ ఎంపీపీ బడుగు మేరీ, బడుగు అర్జునరావు, జంగా రమేష్‌బాబు, త్సవటపల్లి మురళి ఉన్నారు.

బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, క్రీడాకారులు, కోచ్‌లు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో పాఠశాలల విద్యార్థులకు బాస్కెట్‌బాల్ వేసవి ఉచిత శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. శిబిరాన్ని ఎమ్మెల్సీ, మాజీ జాతీయ క్రీడాకారుడు కుడుపూడి సూర్యనారాయణరావు ప్రారంభించారు. కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే మెమోరియల్, కుడుపూడి ప్రభాకరరావు మెమోరియల్, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మొదలైన ఈ వేసవి ఉచిత శిక్షణ శిబిరం వచ్చే జూన్ 1వ తేదీ వరకూ జరగనుంది. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఎవరైనా స్థూలకాయానికి దూరంగా ఉండాలంటే వారు క్రీడలకో, వ్యాయామానికో రోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు. ఈ శిక్షణ శిబిరం ప్రతీ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. తొలి రోజు దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కోచ్‌లు ఉమా మహేశ్వరరావు, బుజ్జి, వెంకట్రావు ఈ శిబిరంలో శిక్షణ ఇవ్వనున్నారు. బాస్కెట్ అసోసియేషన్ ప్రతినిధి సంసాని గంగాధర్, మెహబూబ్ షకీలా, కుడుపూడి త్రినాథ్, చప్పిడి శోభన్‌బాబు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సత్కరిస్తున్న డీవైఈవో, హెచ్‌ఎంలు

అమలాపురం రూరల్: మండలంలో టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను అమలాపురం ఎంఆర్సీ కార్యాలయంలో గురువారం అభినందించారు. అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.నాగలాస్య (587) ప్రథమ స్థానం, ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థిని టీ.హెబ్సిబా (585) ద్వితీయ స్థానం, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎస్.సూర్య శ్రీనివాస్ (583) తృతీయ స్థానం దక్కించుకున్నారు. వీరిని డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, హెచ్‌ఎంలు ఎస్.రాజరాజేశ్వరి, గౌరీశంకర్, సీతాదేవి అభినందించారు.

గ్రామసభ సమస్యలపై డీఎల్‌పీఓ విచారణ

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామ పంచాయతీలో గత నెల 9వ తేదీన జరిగిన గ్రామసభలో గ్రామస్తులు లేవనెత్తిన పలు అంశాలపై డీఎల్‌పీఓ అన్నామణి విచారణ నిర్వహించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆరు ప్రధాన అంశాలపై స్థానిక నాయకుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈఓపీఆర్‌డీ వీజేవీ రమణ, పంచాయతీ కార్యదర్శి వలీబాబా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాళ్లరేవు: కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ నడింపల్లి రమావతి(67) మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ గురువారం తెలిపారు. గత నెల 30వ తేదీన కాకినాడకు చెందిన రమావతి తన కుమారుడు పుల్లంరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై అమలాపురం వెళుతుండగా కోరంగి వంతెన వద్ద కోతులు అడ్డురావడంతో రమావతి కిందకు దూకేశారు. ఈ ఘటనలో రమావతి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి శంకుస్థాపన

అల్లవరం: కొమరగిరిపట్నంలో కొలువైయున్న గ్రామదేవత శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హాజరయ్యారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

యానాం: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఆ శాఖ పట్టించుకోవడం లేదని ఏటా చార్జీలను పెంచుకుంటూ పోతోందని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నట్లు ఇండిపెండెంట్ శాసనసభ్యుడు నెహ్రూ అలియాస్ కుప్పుస్వామి పేర్కొన్నారు. గురువారం గోవా, కేంద్ర పాలిత ప్రాంతాలకు చట్టబద్ధ సంస్థ అయిన జాయింట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా 2025–26, 2029–30 మధ్యకాలానికి విద్యుత్‌శాఖ ప్రతిపాదించిన బహుళ సంవత్సరాల టారిఫ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, నివాసితులు ప్రకటించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో 2వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్. ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవులో 33–11 కేవీ సబ్‌స్టేషన్, గాడిమొగ 11 కేవీ ఫీడర్, చొల్లంగి సబ్‌స్టేషన్ 11 కేవీ చొల్లంగి ఇండస్ట్రియల్ పరిధిలోని గ్రామాలలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. గాడిమొగ, పెదవలసల, చినవలసల, లక్ష్మీపతిపురం, భైరవపాలెం, చొల్లంగి, చొల్లంగిపేట తదితర గ్రామాలలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అమలాపురం రూరల్: కిమ్స్ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 4 వ తేదీ వరకు నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం మాడుగుల నాగఫణి శర్మ ప్రవచనాలు జరుగుతాయి.

ఎర్రజెండా రెపరెపలు

అమలాపురంలో ఘనంగా మే డే ఉత్సవాలు



తాళ్లరేవులో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు


ముమ్మిడివరంలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు


యానాంలో కార్మికుల భారీ ర్యాలీ



అమలాపురంలో మే డే ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: ఎర్ర జెండాలు గురువారం రెపరెపలాడాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సీపీఐ, సీపీఎం స్థూపాల వద్ద ఎర్ర జెండాలను ఎగుర వేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ, ఆటో యూనియన్లకు చెందిన పలు కార్మిక సంఘాల ప్రతినిధులు మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పలు సంఘాలు ఎర్ర జెండాలతో ప్రదర్శనలు నిర్వహించారు. పట్టణంలో 18 చోట్ల మే డే ఉత్సవాలు జరిగాయి. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు, జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో ఈ 18 ప్రాంతాల్లో పార్టీ స్థూపాల వద్ద ఎర్ర జెండాలను ఆవిష్కరించి కార్మిక సభలు నిర్వహించి మే డే ఉత్సవాల ప్రాధాన్యతను వివరించారు. స్థానిక బస్ స్టేషన్ వద్ద జరిగిన మే డే ఉత్సవంలో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. సీపీఎం, సీఐటీయూ జిల్లా కార్యాలయాల వద్ద మే డే ఉత్సవాలు జరిగాయి. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మే డే జెండాల ఆవిష్కరణలు, ప్రదర్శనలు జరిగాయి. స్థానిక సీతాపతిరావుపేట కార్మిక వాడలో ది కోనసీమ డీజిల్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవం జరిగింది. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరనీడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అతిథిగా పాల్గొని మేడే జెండాను ఆవిష్కరించారు. స్థానిక మున్సిపల్ వాటర్ వర్క్స్ కేంద్రం వద్ద ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అమలాపురం శాఖ ఆధ్వర్యంలో మే డే ఉత్సవం జరిగింది. అమలాపురం శాఖ అధ్యక్షుడు దంగేటి షణ్ముఖరావు మే డే జెండా ఆవిష్కరించారు. శ్రీ సిద్ధి వినాయక మోటారు సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాధనాల సత్తిబాబు ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు జరిగాయి. ఆయన మే డే పతాకాన్ని ఆవిష్కరించారు.

తాళ్లరేవు మండలంలో..

తాళ్లరేవు: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని గురువారం తాళ్లరేవు మండలంలో ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులందరూ ఉత్సాహంగా ర్యాలీలు, ప్రదర్శనలు చేశారు. ప్రధానంగా మండల కేంద్రమైన తాళ్లరేవులో సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేకమంది కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి తాళ్లరేవు ప్రభుత్వ ఆస్పత్రివరకు ర్యాలీ నిర్వహించారు. మేడే వర్ధిల్లాలి, కనీస వేతనాలు అమలు చేయాలి, కార్మికులకు అన్యాయం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలి, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సంతపేట సెంటర్‌లో ఎర్రజెండ, ఎర్రజెండ ఎన్నియల్లో అనే పాటకు స్కీం వర్కర్లు నృత్య రూపకం ప్రదర్శించారు. సుంకరపాలెంలో తాపీ మేస్త్రులు, దింపుకార్మికుల సంఘం ప్రతినిధులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. సుంకరపాలెం శ్రీ విజయదుర్గ మెకానిక్ వెల్డర్స్, వర్కర్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. గుడ్డివానితూము సెంటర్‌లో శ్రీ యువశక్తి ఆటో యూనియన్, డ్రైవర్స్ ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఆవిష్కరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రతీ కార్మికుడు శ్రమించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు వెంకటరమణ, వీవోఏల సంఘం ప్రతినిధులు, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం మండలంలో..

ఐ.పోలవరం: ప్రపంచ కార్మికదినోత్సవం 'మే' డే గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఐ.పోలవరంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. మురమళ్ల, ఎదుర్లంక, కేశనకుర్రు గ్రామాల్లో ఆటో యూనియన్లు, ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్, పారిశుధ్య కార్మికులు మేడే ఉత్సవాలు జరుపుకొన్నారు. కార్మిక దినోత్సవ ఆవిర్భావం, పోరాటాలపై పలువురు వివరించారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో మేడే (ప్రపంచ కార్మిక దినోత్సవ) నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాదరావు జెండా ఆవిష్కరించి కార్మికుల హక్కుల గురించి ప్రసంగించారు. అనంతరం ర్యాలీగా బల్లగేటు సెంటర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జూనియర్ సివిల్ జడ్జి రహంతుల్లా అధ్యక్షతన జరిగిన మేడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, జి.గోవిందరాజు, జి.ప్రదీప్, ఎస్. అజయ్ కుమార్, జి.రమేష్, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ముమ్మిడివరం సీపీఐ కార్యాలయం వద్ద మేడే నిర్వహించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి శీలం వెంకటేష్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు పచ్చిమట్ల సత్యనారాయణరాజు పార్టీ పతాకాన్ని, వనచర్ల విజయ్‌కుమార్ ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజుపాలెంలో స్థూపం వద్ద వనచర్ల సత్యనారాయణ, చినసత్యనారాయణలు పతాకాన్ని ఆవిష్కరించారు. దొమ్మేటి వీరం శెట్టి, మనోహర్, పలివెల రాంబాబు, గంజా కృపవర్మ పాల్గొన్నారు.

యానాంలో...

యానాం: మేడే దినోత్సవాన్ని గురువారం యానాంలో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కార్మిక సంఘాలు బైక్‌ర్యాలీని నిర్వహించాయి. స్థానిక పాతబస్టాండ్ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యానాం టాక్సీస్టాండ్, దొమ్మేటీపేట, తదితర సెంటర్లలో కార్మికజెండాలను ఆవిష్కరించారు. దొమ్మేటిపేట ఇండస్ట్రీయిల్ ఎస్టేట్ ప్రాంతం నుంచి యానాం పట్టణం నల్లచెరువు, పిల్లారాయవీధి, పాతబస్టాండ్ మీదుగా భారీ ర్యాలీ కొనసాగింది. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ,కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. రైస్‌మిల్లు, రుంగ్తా లారీవర్కర్స్ యూనియన్ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు దాసరి రాజు, సబ్బతి రాంబాబు, భైరవమూర్తి, దుర్గారావు,సత్యనారాయణ, ఏసు, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బండారులంకలో..

అమలాపురం రూరల్: మండలంలో బండారులంక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుమల సునీత మేడే జెండాను ఆవిష్కరించారు. వడ్రంగి మేస్త్రీల సంఘం, తాపీ మేస్త్రీ సంఘం, అంగన్వాడీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.